మాతృభూమి రుణం తీర్చుకుందాం

- ఐకమత్యంతో దేశాభివృద్ధిలో భాగస్వాములవుదాం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



మాజీ సైనికులు, సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, జెడ్పీ సింహాచలం

పెదగంట్యాడ: ఐకమత్యంతో దేశాభివృద్ధిలో ప్రతీ ఒక్కరం భాగస్వాములవుదామని, మాతృభూమి రుణం తీర్చుకుందామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 65వ వార్డు వికాస్‌నగర్ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో శనివారం నా నేల – నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. దేశం కోసం పోరాడిన త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గాజువాక జోనల్ కమిషనర్ పి. సింహాచలంతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మట్టి ప్రమిదలు వెలిగించి ఐక్యమత్యంతో అభివృద్ధి సాధిద్దామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్టేడియం ప్రాంగణంలో మొక్కలు నాటారు. నా నేల – నా దేశం కార్యక్రమాలను ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామానికి, దేశానికి సేవ చేసిన వారిని గౌరవించి, సత్కరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వార్డుకు చెందిన మాజీ సైనికులు, సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, పల్లా చినతల్లి, సీఆర్పీఎఫ్ సీనియర్ ఎస్ఐ మన్‌జిత్ సింగ్, జి.అరుణ్ శేఖర్, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు దొడ్డి రమణ, గొందేశి వెంకటరమణా రెడ్డి, ఇరోతి గణేష్, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కెమెరా కన్నులో చరిత్ర పదిలం

- స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్
- స్టీల్‌హౌస్‌లో ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్



ఫొటోగ్రాఫర్ వాసును సత్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



అవార్డులందుకున్న ఫొటోగ్రాఫర్లతో స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్, ఫొటోగ్రాఫిక్ సొసైటీ ప్రతినిధులు

ఉక్కునగరం: కెమెరా కన్నుల్లో బంధించిన చిత్రాలు చరిత్రను చిరకాలం భద్రపరుస్తాయని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వాల్తేరు ఫొటోగ్రాఫిక్ సొసైటీ, స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా స్టీల్‌ప్లాంట్ ఉక్కు హౌస్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలోని చిత్రాలను ఆయన తిలకించారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం ప్రారంభం, నిర్మాణ దశ నాటి చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో 1940 నుంచి 2023 వరకు వాడుకలో ఉన్న వివిధ కెమెరాలను ప్రదర్శించారు. వాటిని సీఎండీ పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ పిల్ల రాజారావు, సి.వి. సుబ్రమణ్యం, ఎన్.వి.వి.ఎస్. ప్రసాద్‌లకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీసీ విభాగం జీఎం ఆర్.పి. శర్మ, ఫొటోగ్రాఫిక్ సొసైటీ ప్రతినిధులు పి.ఎస్. సేథ్, వి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు సత్కారం

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఫొటోగ్రాఫర్ వాసును సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది అభిరుచి ఉన్న వృత్తి అన్నారు. ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, పల్లా చినతల్లి, గంగులూరి రోజారాణి, గంట్యాడ గురుమూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురస్కార గ్రహీతలకు అభినందనలు



డాక్టర్ ప్రమీల, హేమలక్ష్మిలను అభినందిస్తున్న ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన అగనంపూడి ఏరియా ఆస్పత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ గైనిక్ డాక్టర్ వి.ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ టి.హేమలక్ష్మిలను ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శనివారం అభినందించారు. డాక్టర్ జై భారతి, ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రమీల, హేమలక్ష్మి అంకితభావంతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయి సేవా సమితి నూతన కమిటీ ఎన్నిక

అగనంపూడి: అగనంపూడిలోని శ్రీ షిర్డీ సాయి సేవా సమితి నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. సమితి అధ్యక్షుడిగా కొయ్య వెంకట రమణా రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పల్లవరజ్జుల రామారావు, కార్యదర్శిగా ధర్మాల వ్యాస శర్మ, సంయుక్త కార్యదర్శిగా గంధోళి శంభుడు ఎన్నికయ్యారని కమిటీ ప్రకటించింది. కోశాధికారిగా రాచకొండ సత్య శ్రీదేవి, సంయుక్త కోశాధికారిగా వి.వెంకట రాజు, కమిటీ సభ్యులుగా ధర్మాల సత్యలక్ష్మి, పి.ఎల్.ఎస్.రాజు, పడాల పంకజ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కమిటీ 2023 నుంచి 2026 వరకు సేవలను అందిస్తుందన్నారు. బాబా ఆలయ పునర్నిర్మాణాన్ని రూ.30 లక్షలతో చేపట్టాలని తీర్మానించినట్లు తెలియజేశారు.


'ఉక్కు' అమ్మకం ప్రతిపాదన విరమించుకోవాలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక శక్తికి తలవంచి విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 919వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిర్వాసితులకు, కార్మికులు అన్యాయం చేస్తూ సంస్థను అమ్మడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్‌కు కృష్ణా కళాశాల విద్యార్థులు



యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన విద్యార్థులు

మద్దిలపాలెం : రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌కు డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి. సుజాత తెలిపారు. రెండు రోజులుగా నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌లో జానపద గీతాల విభాగంలో ప్రతిభ కనబరిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెస్టివల్‌కు ఎంపికయ్యారన్నారు. వీరిలో ఆర్.సునీత, సీహెచ్.సునీత, కావ్యశ్రీ, రాజీ, హాసిని బృందం గీతాలాపన విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారన్నారు. దీంతో వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు.

సీఎం జగన్ పాలన సువర్ణాధ్యాయం



ప్రభుత్వ పథకాలను తెలిపే కరపత్రాన్ని లబ్ధిదారుకు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఆయనకే చెందుతుందని అన్నారు. అందుకే ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 86వ వార్డు భరత్‌నగర్-1 సచివాలయ పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేశారు. సమస్యలున్నా, అర్హులై ఉండి, పథకాలు అందకపోయినా తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా కత్తిరించాలా అనే ఆలోచనతో పరిపాలన సాగిస్తే.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులను వెదికి మరీ సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ప్రజలు ఈ తేడాను గుర్తించి, జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వి.వి.ఎస్.ఎన్.రాజు, వార్డు అధ్యక్షులు వెలుగుల పరశురాముడు, మాటూరి శ్రీనివాసరావు, చేగొండి శ్రీనివాసరావు, వాడపల్లి రామచంద్రరాజు, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, పోలీస్ శాఖ, ఎలక్ట్రికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఇంటక్, సిటూ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 31వ తేదీన జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పొత్తులతో బరిలో దిగుతున్న ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ ప్రతినిధులు సంస్థ ప్రధాన గేటు వద్ద శనివారం ప్రచారం నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పోటీలో నిలిచిన ఉరుకూటి బాబూరావు, అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న జి.టి.పి.ప్రకాష్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో వి.ఆనందరావు, ఎస్. జగన్నాధరావు, రామారావు, కనకారావు, చిట్టిబాబు,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తోపుడుబళ్ల వ్యాపారులకు అనుమతులివ్వాలని వినతి



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న బోగాది

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 69వ వార్డు షీలానగర్‌లో సర్వీసు రోడ్డు పక్కన తోపుడు బళ్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ చిరు వ్యాపారులు జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మను కోరారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావుతో కలిసి ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు తోపుడుబళ్లను హఠాత్తుగా తొలగించడంతో 250మంది జీవనోపాధి కోల్పోయామని తెలిపారు. తమ సమస్యను ఎమ్మెల్యేకు కూడా తెలియజేశామన్నారు. తిరిగి బళ్లు, చిరు వ్యాపారాల దుకాణాలు పెట్టుకునేందుకు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లికి జలాభిషేకం

25 నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలు



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ మూర్తి తదితరులు

గాజువాక: ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న జాతర మహోత్సవాల సందర్భంగా గాజువాక రాజీవ్ మార్గ్‌లోని సత్తెమ్మతల్లికి భక్తులు జలాభిషేకం నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో బిందెలతో పసుపు, కుంకుమ నీళ్లను తీసుకొచ్చి అభిషేకం చేశారు. కార్యక్రమాన్ని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగిస్తామని, 27వ తేదీన ప్రధాన పండగను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సూరిశెట్టి శివ, కమిటీ పర్యవేక్షకులు దొడ్డి రమణ, మద్దాల అప్పారావు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నాగుపాము కలకలం



నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

సీతమ్మధార (విశాఖ ఉత్తర) : నర్సింహనగర్‌కు చెందిన సీపీ అవధాని ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి నాగుపాము (స్పెక్టికల్ కోబ్రా) చొరబడింది. వంట గదిలోని పోపుల డబ్బాల మధ్య ఇమిడి ఉన్న ఆ పామును శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో చూసి అవధాని కుటుంబ సభ్యులు భయాందోళనకు లోనయ్యారు. వెంటనే గాజువాకలోని స్నేక్ కిరణ్‌కు సమాచారం అందజేశారు. అతను హుటాహుటిన వచ్చి చాకచక్యంగా నాగుపామును బంధించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా స్నేక్ కిరణ్ మాట్లాడుతూ పాములు ఇళ్లలో, కార్యాలయాల్లో చొరబడినప్పుడు భయపడకుండా, 88663-68899 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వెంకన్న సన్నిధిలో అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న దొడ్డి రమణ, మంత్రి మంజుల తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. గంగిశెట్టి హరీష్, విజయలక్ష్మి, రామసాయి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు దొడ్డి రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి మంజుల, గణేష్ కుమార్, నందన ప్రియ, విజయకుమార్, రమణి, డి. నాగరాజు పాల్గొన్నారు.

బాలాజీకి సహస్ర పుష్పార్చన



గులాబీ పుష్పాల్లో గోవిందుడు

అక్కిరెడ్డిపాలెం: శ్రీనివాసుడికి పసుపు గులాబీలతో సహస్ర నామార్చన చేశారు. షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామి వారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించి, విశేష పుష్పాలతో అర్చించారు. ట్రస్ట్ ప్రతినిధుల సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వీధి దీపాలు వెలగడం లేదని ధర్నా

గాజువాక : జీవీఎంసీ 86వ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదంటూ ఆ వార్డుకు చెందిన నివాసులు జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ కాలనీ సంఘాల ప్రతినిధులు జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జోనల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం ద్వారా నిరసన తెలిపారు. అనంతరం కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ వార్డులో మొత్తం 980 వీధి దీపాలు వెలగడం లేదని కార్పొరేటర్ పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ సంఘాల నాయకులు బొడ్డ రమణ, రెడ్డి, సూర్యప్రభ, కాసాపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూకేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని వినతి



ఏపీ ట్రాన్స్ కో అడిషనల్ సెక్రటరీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులోని గుడివాడ అప్పన్నకాలనీ నుంచి బొజ్జన్న కొండకు వయా గాజువాక హై స్కూల్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణకు ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన భూ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఈపీడీసీఎల్, ట్రాన్స్‌కో అధికారులను కోరారు. విజయవాడలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏపీ ట్రాన్స్‌కో అడిషనల్ సెక్రటరీ వి.శ్రీనివాసరావును, ఏపీఈపీడీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎస్.చక్రధర్ బాబును కలిసి వినతిపత్రాలు అందించారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు గాజువాకకు వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఈ రోడ్డు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, త్వరితగతిన భూములను కేటాయించి పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారని లతీష్ తెలిపారు.

మహిళల స్వయం ఉపాధికి సహకారం



చపాతీ తయారీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: మహిళలు స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సూచించారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వివేకానందకాలనీలో వసుధా దేవి అనే డ్వాక్రా సంఘం సభ్యురాలు జీవీఎంసీ సహకారంతో బ్యాంకు రుణం ద్వారా సుమారు రూ.6 లక్షలతో చపాతీ తయారీ యంత్రాన్ని సమకూర్చుకున్నారు. ఆ యంత్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మహిళల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మహిళలు స్వయం ఉపాధి రంగం వైపు వేసే ప్రతీ అడుగుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంగ్రాన నూకరాజు, గొంతిన సత్యవతి, గొంతిన శ్రీనివాసరావు, బోనెల జోసెఫ్, శశిభూషణరావు, ఎం.సత్యవతి, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు



వెన్నలపాలెం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలపై ఆరా తీస్తున్న దివాన్ మైడిన్

పరవాడ: జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.ఎం.దివాన్ మైడిన్ సూచించారు. మండలంలోని వెన్నలపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీని శనివారం ఆయన సందర్శించి కాలనీలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ నెల 30న జగనన్న కాలనీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని కాలువలు, రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. త్వరితగతిన మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీ ముఖద్వారం వద్ద రూ.6 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఆర్చి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందరావు, పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, ఉపసర్పంచ్ వెన్నల సన్యాసిరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ హెచ్‌డీఈ ప్రసాద్, డీఈ రాజు, ఏఈ కె.ఎస్.ఎన్.రెడ్డి, ఆర్.డబ్ల్యూఎస్ ఏఈ షన్ముఖ, పంచాయతీ రాజ్ ఏఈ జి.రామారావు, పరవాడ, వెన్నలపాలెం పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, వరలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పీఎం విశ్వకర్మ పథకంతో కులవృత్తులకు ప్రయోజనం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గాజువాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 15న ప్రకటించిన పీఎం విశ్వకర్మ పథకం కులవృత్తులు చేసుకునేవారికి ప్రయోజనకారిగా ఉంటుందని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. గాజువాక బీజేపీ కార్యాలయంలో ఆ పథకం బ్రోచర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం ద్వారా నేత, స్వర్ణకారులు, కమ్మరి, కుమ్మరి, శిల్పులు, చెప్పులు కుట్టేవారు, లాండ్రీ కార్మికులు, క్షురకులు తదితర 18 వృత్తులవారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ పథకంలో రూ.25 వేల నుంచి రూ.2 లక్షల రూపాయల వరకు రుణం పొందవచ్చని, వడ్డీపై ఐదు శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ఎటువంటి హామీ లేకుండా బ్యాంకుల ద్వారా ఈ రుణాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వీక్‌ను నిర్వహించారు. వారం రోజులుగా విభాగాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధ చట్టాలు, శిక్షలు, పర్యవసానాలను వివరించారు. ర్యాగింగ్‌కి దూరంగా ఉండాలని, స్నేహపూర్వక వాతావరణంతో మసలుకోవాలని విద్యార్థులకు ఆచార్యులు సూచించారు. విద్యార్థుల్లో మరింత అవగాహన పెంచే విధంగా వ్యాసరచన, ఉపన్యాస, పోస్టర్ల తయారీ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు తెలిపారు.